క్లుప్తంగా

సమస్యలపై 'సజ్జల'కు వినతి



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి విజయవాడలో సోమవారం విజ్ఞప్తి చేశారు. దశలవారీగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, ట్రాన్స్‌కోలో మూడో పార్టీ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా పరిహారం ఇవ్వాలని కోరారు. సమస్యలను సీఎంకు తెలియజేస్తానని సజ్జల తెలిపారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కాశీ, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుబాబు, రాష్ట్ర నాయకులు సుధాకర్, హేమకుమార్, రవినాయక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 32 మంది ఎంపిక



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

బంగారుపాళెం: ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లకు 32 మంది ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్టు, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 45 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 32 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైలోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



టీచర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ గౌరి తనిఖీ చేశారు. విద్యార్థి తల్లిదండ్రుల విన్నపాల మేరకు సోమవారం భోజన సమయంలో పరిశీలించారు. పౌష్టికాహారం అందిస్తున్నారా? లేదా?, మెనూ ప్రకారం వండుతున్నారా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

వినాయకుని సేవలో శైలజాచరణ్‌రెడ్డి



శైలజాచరణ్ రెడ్డి కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఆలయాధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ రాయలసీమ జోనల్ చైర్మన్ శైలజాచరణ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఉదయం ఆమె కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ చౌర్యంపై 532 కేసులు

- రూ.11.26 లక్షల జరిమానా

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో అధికారులు 3,440 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసి, కేసులు నమోదు చేసినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. విద్యుత్ చౌర్యం, అదనపు లోడ్‌పై దాడులు జరిపి, మొత్తం 532 కేసులు నమోదు చేసి అపరాధ, క్రమబద్ధీకరణ రుసుం కింద రూ.11.26 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చామన్నారు. తిరుపతి ఆపరేషన్ పరిధిలో 92 కేసులు, తిరుపతి రూరల్ 56, పుత్తూరు 67, చిత్తూరు అర్బన్ 73, చిత్తూరు రూరల్ 50, మదనపల్లె 88, పీలేరు 24, పుంగనూరులో 82 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

పలమనేరు : కుప్పం- పలమనేరు రహదారిపై దుగ్గినవారిపల్లె వద్ద సోమవారం రాత్రి లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. బైరెడ్డిపల్లె మండలం కొత్తిండ్లుకు చెందిన నాగరాజు(46) బైక్‌పై పలమనేరుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

చరిత్రాత్మకం.. ప్రజా సంకల్పం

- వైఎస్సార్‌కు నివాళి
- జెడ్పీలో కేక్ కట్ చేసిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు







వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ తదితరులు, కేక్ కట్ చేస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే, మేయర్ తదితరులు, ఐరాలలో కేక్ కట్ చేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నేతలు

చిత్తూరు కార్పొరేషన్: చరిత్రాత్మకంగా నిలిచి, వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడానికి దోహదం చేసిన ప్రజాసంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయ్యాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. 341 రోజులు 3,648 కిలోమీటర్లు నడిచి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి నిబద్ధతతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. నవరత్నాలతో పాటు మరెన్నో పథకాలు కొత్తగా ప్రవేశపెట్టారన్నారు. సర్పంచ్, మండల, జిల్లాపరిషత్, మున్సిపాలిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థులను ప్రజలు గణనీయమైన మెజార్టీతో గెలిపించారన్నారు. గ్రామపాలనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అందరి సంక్షేమానికి పట్టం కట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల సంబరం..!

చిత్తూరు అర్బన్: వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా చిత్తూరులోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులకు పంచి పెట్టారు. కార్పొరేషన్ కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వందశాతం హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే

గుడిపాల: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి ఎంపీపీ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం వరకు సీఎం నెరవేర్చారన్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరవేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శిలంబరసన్, వెంకటేష్‌రెడ్డి, రఘు, దావిద్, రవీంద్రారెడ్డి, వరదరాజులురెడ్డి, యోహాన్, శేఖర్, విక్టర్ పాల్గొన్నారు.



బంగారుపాళెం: కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజా సంకల్పయాత్రతో సుపరిపాలనకు నాంది

బంగారుపాళెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర రాష్ట్రంలో సరికొత్త, సుపరిపాలనకు నాంది పలికిందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. సోమవారం బంగారుపాళెంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కరిడివారిపల్లె వద్ద దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, దొరస్వామి, నాగరాజ, జగదీష్, విజయకుమార్, జేమ్స్, బాబు, భరత్‌రెడ్డి, చాన్‌బాషా, గోపి పాల్గొన్నారు.



అరగొండలో..

ప్రతి గడపకూ పాదయాత్ర లక్ష్యాలు

ఐరాల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర లక్ష్యాలను ప్రతి గడపకూ తీసుకెళ్లారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించి, సుపారిపాలన అందిస్తుండడంతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన సీఎం జగనన్నను ఎదుర్కొలేక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు నిర్మించిన వైఎస్సార్ సీపీ కంచుకోటను బద్ధలు కొట్టలేరని స్పష్టం చేశారు.



యాదమరిలో సంబరాలు జరుపుకుంటున్న నేతలు

మాట తప్పని నాయకుడు జగనన్న

తవణంపల్లె: పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట తప్పని నాయకుడిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని అరగొండ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మండలంలోని అరగొండ కొత్త బస్టాండ్‌లో వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూజలు చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మాధవరంలో పార్టీ నాయకులు, యువత నాయకులు ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. కేక్‌కట్ పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిషోర్ రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వర రెడ్డి, ప్రశాంత కుమార్, పార్థసారథిరెడ్డి, సందీప్ రెడ్డి, మధు కుమార్, రూపేష్ రెడ్డి, దినేష్ రెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండల కేంద్రమైన యాదమరిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తి కావడంతో సంబరాలు జరుపుకున్నారు. ఉదయం పార్టీ కార్యాలయంలో ఎంపీపీ సురేష్ బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మనోహర్, వైఎస్సార్‌సీపీ యూత్ మండల అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, ఢిల్లెయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధి పెద్ద పీట





మాట్లాడుతున్న ఎక్స్ అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

- నగర మేయర్ అముద
- ప్రశాంతంగా నగర కౌన్సిల్ సమావేశం

చిత్తూరు అర్బన్: నగరాభివృద్ధికి పెద్ద పీట వేయాలని నగర మేయర్ ఎస్. అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. అధ్యక్షత వహించి మేయర్ మాట్లాడారు. నగరంలో అభివృద్ధి పనులతో పాటు అత్యవసర పనులు చేయించడానికిగాను ప్రతి వార్డుకు పనులకు సంబంధించి రూ.5 లక్షల పరిమితితో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ చిత్తూరు మున్సిపాలిటీలో మరిన్ని అభివృద్ధి పనుల కోసం అదనపు నిధులు మంజూరు చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరినట్లు చెప్పారు. ప్రస్తుతం గడప గడపకు కార్యక్రమంలో భాగంగా వార్డు సచివాలయాలకు మంజూరు చేసిన రూ.20 లక్షలతో పనులు చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులపై ప్రెజెంటేషన్

ఇటీవల కాలంలో చేసిన, త్వరలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై నగర కమిషనర్ జె.అరుణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌన్సిల్ సభ్యులకు వివరించారు. నగరంలో కూడళ్ల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, గంగినేని చెరువు పార్క్‌లో ఓపెన్ జిమ్, జగనన్న హరిత నగరాల పనులు, స్మార్ట్ స్ట్రీట్ పనులు, క్లీన్ ఆంధ్రప్రదేశ్..తదితర అంశాలను ఆమె దృశ్యమాధ్యమంతో విపులీకరించారు. అలాగే జగనన్న శాశ్వత భూ రక్ష హక్కు పథకంపై సభ్యులకు అవగాహన కల్పించారు. కౌన్సిల్ సమావేశంలో భాగంగా పలువురు కార్పొరేటర్లు తమ వార్డు పరిధిలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు. కాగా, నగర పాలక సంస్థ చేసిన కొన్ని ప్రధాన అంశాలపై తీర్మానాలు చేసింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మెజారిటీ కార్పొరేటర్ల ఫిర్యాదు మేరకు నగరపాలక సంస్థ సీనియర్ అకౌంటెంట్ కే.కుమార్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని టేబుల్ అజెండాగా ఆమోదించడం అందులో ఒకటి.



హాజరైన కార్పొరేటర్లు, అధికారులు

పనుల పూర్తికి కృషి చేయాలి



మంగళపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

బంగారుపాళెం: మండలంలోని పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చిత్తూరు ఉప విద్యాశాఖాధికారి (డీవైఈఓ) చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని మంగళపల్లె, మహాసముద్రం గ్రామాల్లోని పాఠశాలలను డీవైఈఓ తనిఖీ చేశారు. తొలుత మంగళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల కోసం నిర్వాహకులు వండిన భోజనాన్ని రుచి చూశారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం మహాసముద్రం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం లలిత పాల్గొన్నారు.

కాణిపాకంలో సంకటహర చతుర్థివ్రతం నేడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. పౌర్ణమి తరువాత నాలుగోరోజు ఆలయంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సంకటహర చతుర్థి వ్రతం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం రాత్రి 7 గంటలకు బంగారు రథం ఆలయ మాడ వీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు.

నేడు తుమ్మిందలో గడప గడపకు..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్వహిస్తారని ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాల ఫ్యాక్టరీపై చర్యలకు వినతి

పలమనేరు: పట్టణంలని ఎల్‌బీ నగర్‌లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల ఫ్యాక్టరీతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవించారు. సోమవారం ఈ మేరకు పురపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్రకు వినతిపత్రం అందించారు. ఆమె ఆదేశాల మేరకు కమిషనర్ కిరణ్‌కుమార్ ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ ఫ్యాక్టరీకి విద్యుత్ కనెక్షన్ తొలగించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడైనా పర్యావరణానికి హాని చేసే పరిశ్రమల కోసం కరెంట్ సర్వీసుకు దరఖాస్తు చేస్తే మున్సిపల్ అనుమతులు తీసుకున్న తర్వాతే మంజూరు చేయాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు తథ్యం



మాధవరంలో ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తవణంపల్లె: వైఎస్సార్ సీపీ మద్దతుతో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి విజయం తథ్యమని తవణంపల్లె ఎంపీపీ గీతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, పార్టీ మండల కన్వీనర్ సిద్ధంపల్లె హరిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని మాధవరం, కృష్ణాపురం, గోవిందరెడ్డి పంచాయతీల్లో పార్టీ నాయకులు విస్తృతంగా పర్యటించి, ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలసి అభ్యర్థించారు. అర్హత ఉన్న పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని శ్యాంరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వర రెడ్డి, మధుకుమార్, రంజిత్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, శివాజీరెడ్డి, స్వరూప్ రెడ్డి, దినేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి యత్నం

- ధర్నా పేరిట టీఎన్ఎస్ఎఫ్ నాయకుల ఓవరాక్షన్
- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు



గోడ దూకిలోనికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్: శాంతిభద్రతలను విఘాతం కలిగించడమే టీడీపీ నాయకులకు పనిగా మారింది. తమ డిమాండ్ల సాధనకు సోమవారం కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తామని పోలీసుల నుంచి ముందస్తు అనుమతి పొందిన టీఎన్ఎస్ఎఫ్ (తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్) నాయకులు చివరకు అత్యుత్సాహం ప్రదర్శించారు. ధర్నా చేయడానికి బదులు కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు వారిని నిలువరించేందుకు యత్నించారు. అయినా లెక్కచేయకుండా కలెక్టరేట్ గోడ దూకి లోనికి వెళ్లేందుకు విఫలయత్నం చేశారు. వారిని అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆరుగురు టీఎస్ఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ ధర్నాలో వరుణ్, ప్రభుతేజ, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ప్రజాప్రతినిధులకు సన్మానం



బంగారుపాళెంలో బీసీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న నాయకులు

బంగారుపాళెం: బీసీ ప్రజాప్రతినిధులను సోమవారం బంగారుపాళెంలో సన్మానించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ అమరావతి, తగ్గువారిపల్లె సర్పంచ్ వాణీప్రియ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ అధికారప్రతినిధిగా నియమితులైన బంగారు నాయరాయణ స్వామి, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన దేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్నకుమార్ మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య సారధ్యంలో బీసీల సంక్షేమానికి నాయకులు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు మునిరత్నం, వీరశంకరయ్య, చిరంజీవి, విశ్రాంత తహసీల్దార్ వెంకటకృష్ణ, పాండు, గురుమూర్తి, కోదండ, ఖాదర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే జగన్..!

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- తొప్పాతిపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులతో మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: జనం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం తొప్పాతిపల్లెలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన వివిధ పథకాల లబ్ధిని బుక్‌లెట్‌ను ఇచ్చి వివరించారు. స్థానికులు నివేదించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మహిళాభివృద్ధికి సీఎం పెద్ద పీట వేస్తున్నారని, పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా పనిగట్టుకుని చేస్తున్న కువిమర్శలు, దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరాదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, వైస్ ఎంపీపీలు జయరాం, రంజని, సర్పంచ్ మునిరత్నం, నాయకులు త్యాగరాజులు, సంపత్, రాబర్ట్, కన్నన్, కిరణ్, రమణ, మణి, శేషాద్రి, గుణ, మనోహర్, వెంకటేష్, దేవేంద్ర, సురేష్, కుమార్, నంద, జైపాల్, బాబు, దిలీప్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పల్లె సీమలు

ఐరాల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెసీమలు ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని చిగరపల్లె సచివాలయంలోని చిగరపల్లె, చిగరపల్లె దళితవాడ, కొత్తఅగరంపల్లె, తిరువణంపల్లె, తిరువణంపల్లె దళితవాడ, తిరువణంపల్లె బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 520 కుటుంబాలను కలసి పలకరించారు. తొలుత చిగరపల్లె దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ కుటుంబానికి, ఏ మేరకు లబ్ధి చేకూరిందని బుక్‌లెట్‌ల ద్వారా వివరించారు. ఎవరికైనా ఆయా పథకాలు సక్రమంగా అందకపోతే అందుకు గల కారణాలను సంబంధిత అధికారులను ప్రశ్నించి, వాస్తవాలను ప్రజలకు వివరించారు. చిగరపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన అనంతరం పార్టీ నేతలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, సర్పంచులు రఘు, సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు విజయకుమారి, యువజన విభాగం మండల కన్వీనర్ భార్గవ్‌రెడ్డి, సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ హరీష్‌రెడ్డి, ఏఎంసీ సభ్యుడు రామచంద్ర, పార్టీ నేతలు చలపతిరెడ్డి, సురేష్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, సురేంద్రయాదవ్, దొరబాబు, శేషాద్రి, రాము, రత్నం, రవిప్రసాద్, రాజేష్‌రెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.



చిగరపల్లెలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

స్పందన వినతులు పరిష్కరించండి

చిత్తూరు అర్బన్: 'స్పందన' అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజారోగ్య విభాగానికి 4, రెవెన్యూ 3, టీపీఓ 3, మెప్మా 2, ఇంజినీరింగ్ అకౌంట్ సెక్షన్‌కు ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం వాటిపై అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, అధికారులు లోకేష్, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ

రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూర రూరల్: స్పందన అర్జీలపై దృష్టి సారించాలని తహసీల్దార్ పార్వతి అధికారులను ఆదేశించారు. సోమవారం చిత్తూరులోని తన కార్యాలయంలో తహసీల్దార్ స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దారి తగదాలు, భూ సమస్యలు, పట్టా మంజూరు తదితర సమస్యలపై 18 అర్జీలు వచ్చాయి. వీటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఉద్యోగులను ఆదేశించారు.

మంచు కురిసే వేళలో..

తవణంపల్లె: మండల కేంద్రాన్ని సోమవారం ఉదయం దట్టమైన పొగ మంచు కమ్మేసింది. దీంతో వాహనచోదకులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8.30 గంటల వరకు దట్టమైన పొగమంచు వీడకపోవడంతో వాహనచోదకులు తమ వాహనాల లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లారు. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది.



తవణంపల్లెలో రోడ్డును కమ్మేసిన పొగమంచు